ఘనంగా సహకార దినోత్సవం

నిజాంపేట, నవంబర్ 14: కల్వకుంట పీఏసీఎస్ కార్యాలయంలో 71 వ సహకార దినోత్సవాన్ని డైరెక్టర్లు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఈవో గోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు రవీందర్‌రెడ్డి, రేణుక, వెంకట్‌గౌడ్, రైతులు రాంచంద్ర రెడ్డి, మంగళి లక్ష్మీనర్సు ఉన్నారు.

మెదక్‌లో ఉచిత వైద్య శిబిరం

మెదక్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ) : నిజాంపేటలోని ఎస్ఎల్‌జీ దవాఖానలో మెదక్‌లోని కిరణ్ ఈఎన్‌టీ, మల్టీ స్పెషాలిటీ దవాఖాన హైదరాబాద్ వారు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు మేనేజర్లు మురళీ, సందీప్ తెలిపారు.

నిజాంపేటలో..

నిజాంపేట, నవంబర్ 14: నిజాంపేట, కల్వకుంట గ్రామాల్లో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిజాంపేట వెటర్నరీ డాక్టర్ మౌనిక గురువారం ప్రారంభించారు. పాడి పశువుల్లో గర్భకోశ, గాలికుంటు వ్యాధులు వస్తాయని, నివారణకు చికిత్స అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గోపాల మిత్ర సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, గోపాల మిత్రలు స్వామి, బాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నిజాంపేట, నవంబర్ 14: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల ప్రత్యేకాధికారి గోవింద్ సూచించారు. గురువారం నిజాంపేట ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఆయన వెంట ఎంపీడీవో రాజిరెడ్డి, మిషన్ భగీరథ ఏఈ భిక్షపతి, ఎంపీవో ప్రవీణ్, హెచ్ఎం జ్ఞానమాల ఉన్నారు.

ప్రాణాలు తీస్తున్న వాహనాలు

ఎల్లాపూర్ వద్ద రోడ్డుకు ఇరువైపేలా నిలిపిన వాహనాలు

పాపన్నపేట, నవంబర్ 14: మండలంలోని ఎల్లాపూర్ రైసుమిల్ వద్ద ధాన్యం లారీలు ఇరువైపులా ఆపి ప్రజల ప్రాణాలు తీస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. మెదక్ మండలం బొడ్మట్‌పల్లి ప్రధాన రహదారి పక్కనే గల రైసుమిల్‌కు ధాన్యం తీసుకొస్తున్న లారీలు రోడ్డుకు ఇరువైపులా తమ వాహనాలను నిలపడంతో ప్రమాదాలు జరిగి వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా సంబంధిత యాజమాన్యం పట్టించుకోవడం లేదు. గతంలో హైదరాబాద్ నుంచి పేపర్ తీసుకొస్తున్న ఆటో లారీని ఢీకొనడంతో ఇరువురి ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల ఒక వాచ్‌మెన్ అక్కడే ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఇలా ప్రమాదాలు జరుగుతున్నా రైసుమిల్ యాజమాన్యం లారీలను అక్కడే నిలుపుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రయాణికులు కోరుతున్నారు.

కులగణన సర్వేను పరిశీలించిన జడ్పీసీఈవో

ప్యాడీ సెంటర్‌ను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

అల్లాదుర్గ్, నవంబర్ 14: మండలంలోని గడిపెద్దాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న కులగణన సర్వేను జడ్పీసీఈవో ఎల్లయ్య గురువారం పరిశీలించారు. సర్వేను పర్యవేక్షించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. వారి పనితీరును చూసి సిబ్బందిని అభినందించారు. అనంతరం గడిపెద్దాపూర్ ప్యాడీ సెంటర్‌ను పర్యవేక్షించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, సూపరింటెండెంట్ శంకర్, కార్యదర్శి రాములు, ఐకేపీ సిబ్బంది సిద్దేశ్వర్, హిమబిందు పాల్గొన్నారు.

'సమగ్ర సర్వే'ను పరిశీలించిన డీపీవో యాదయ్య

లింగారెడ్డిపేట్‌లో సమగ్ర సర్వే తీరును పరిశీలిస్తున్న డీపీవో యాదయ్య

మనోహరాబాద్, నవంబర్ 14 : మండల కేంద్రంలోని మనోహరాబాద్‌తో పాటు లింగారెడ్డిపేట్, పాలాట, పోతారం, ముప్పిరెడ్డిపల్లి గ్రామాలను జిల్లా పంచాయతీ అధికారి ఆకస్మికంగా సందర్శించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తీరును పరిశీలించి ఎన్యూమరేటర్లకు తగు సూచనలు, సలహాలు చేశారు.

గ్రౌండ్ బేస్ లెర్నింగ్‌పై పకడ్బందీ ప్రణాళిక

మెదక్ మున్సిపాలిటీ: బాలికలకు గ్రౌండ్ బేస్ లెర్నింగ్‌పై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

రామాయంపేట: కాట్రియాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



నిజాంపేట ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జ్ఞానమాలను సన్మానిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

- కలెక్టర్ రాహుల్ రాజ్
- బాలికలకు గ్రౌండ్ బేస్ లెర్నింగ్‌పై అవగాహన

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 14: జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో గ్రౌండ్ బేస్ లెర్నింగ్ విధానాన్ని ప్రారంభించేలా పకడ్బందీగా ప్రణాళికలు తయారు చేయాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని గురుకుల బాలికల పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రౌండ్ బేస్ లెర్నింగ్ విధానాన్ని డీఈవో రాధాకిషన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ 9వ తరగతి బాలికలకు భౌతిక శాస్త్రంలోని దూరం-స్థానభ్రంశం, వడి-వేగం అనే అంశంపై ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు ఆర్థమయ్యేలా బోధించారు. అనంతరం ప్రశ్నలతో వారి సామర్థ్యాలను పరీక్షించి, అభినందించారు. చదువుల్లో బట్టి విధానాన్ని పక్కనబెట్టి మన శాస్త్రవేత్తలు కనుగొన్న చక్కటి సూత్రాలతో అర్థం చేసుకుని సులభతరంగా విద్యను అభ్యసించాలన్నారు. తద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. త్వరలో జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులకు గ్రౌండ్ బేస్ లెర్నింగ్‌పై ఒక రోజు అవగాహన నిర్వహించాలన్నారు. అనంతరం అగస్త్య ఫౌండేషన్ నిర్వహిస్తున్న సైన్స్ మేళాను సందర్శించి నిర్వాహకులను అభినందించారు. ఈ మేళాలో విద్యార్థులు స్వయంగా సరికొత్త ప్రయోగం తయారు చేసేలా ప్రోత్సహించే దిశగా అవగాహన కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈవో నీలకంఠం, రిసోర్స్‌పర్సన్ ప్రభు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తారాసింగ్ పాల్గొన్నారు.

రామాయంపేటలో ఉపన్యాస, వ్యాసరచన పోటీలు

రామాయంపేట, నవంబర్ 14: బాలల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. మండలంలోని కాట్రియాల, లక్ష్మాపూర్, తొనిగండ్ల, అక్కన్నపేట, డి.ధర్మారం తదితర గ్రామాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

నిజాంపేటలో..

నిజాంపేట, నవంబర్ 14: మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బాలల దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాంపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్ఎం జ్ఞానమాలను సన్మానించారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, నవంబర్ 14: జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని చిన్నశంకరంపేటలో మాజీ సర్పంచ్ రాజిరెడ్డి చాచానెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదర్శ పాఠశాలలో జయంతిని నిర్వహించారు.

మెదక్‌లో..

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 14: జవహర్‌లాల్ నెహ్రూ 135వ జయంతిని పురస్కరించుకుని మెదక్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

దుర్గమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

దుర్గమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

పాపన్నపేట,నవంబర్14: ఏడుపాయల వన దుర్గాభవానీ మాతను గురువారం మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. వేద పండితులు తీర్థప్రసాదాలు అందజేశారు.

సనాతన ధర్మాన్ని కాపాడాలి: అఘోరి

అనంతరం ఏడుపాయల వనదుర్గాభవానీ మాతను అఘోరి శివాని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధర్మ సంరక్షణకోసం హిందువులంతా ఏకతాటిపై వచ్చి సనాతన ధర్మాన్ని కాపాడాలన్నారు. దేవతా విగ్రహాలను కొందరు దుండుగులు ధ్వంసం చేస్తున్నారని, ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిని ఉపేక్షించవద్దని, దుండుగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

జ్యోతిని వెలిగిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 14:గ్రంథాలయాలను వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి అన్నారు. గురువారం గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జ్యోతిప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. చదువుపై దృష్టి కేంద్రికరిస్తే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని ఆమె సూచించారు. ప్రతి విద్యార్థి నిత్యం గ్రంథాలయానికి వెళ్లి మేధాశక్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ లక్ష్మీనారాయణగౌడ్, నర్సాపూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ హంసీబాయి, లైబ్రేరియన్లు నరేందర్‌రెడ్డి, శంకర్, యాదగిరి పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్, నవంబర్ 14: నర్సాపూర్‌లోని విష్ణు ఫార్మసీ కళాశాలలో గ్రంథాలయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌వోడీలు వనిత, సౌజన్య, లైబ్రేరియన్ రజిని, అధ్యాకురాలు సంధ్యారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

బస్టాండ్ లేక ప్రయాణికుల ఇక్కట్లు

బస్టాండ్ లేక రోడ్డుపైనే నిలబడ్డ విద్యార్థులు

రోడ్డు పైనే పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు

చిన్నశంకరంపేట, నవంబర్ 14: చిన్నశంకరంపేటలో బస్టాండు లేక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండలో ఎండుతూ వానలో తడుస్తూ తమ ప్రయాణాన్ని కొనసాగించాల్సిన దుస్థితి నెలకొన్నది. చిన్నశంకరంపేట చుట్టపక్కల గ్రామాల ప్రజలు నిత్యం వందలాది మంది తమ ప్రయాణాన్ని చిన్నశంకరంపేట నుంచి కొనసాగిస్తున్నారు. కామారం, మల్లుపల్లి, జంగరాయి, చందాపూర్, రుద్రారం తదితర గ్రామాల ప్రజలు హైదరాబాద్ లేదా మెదక్ వెళ్లాలంటే చిన్నశంకరంపేటకు రావాల్సిందే. విద్యార్థులు కూడా నానా అవస్థలు పడుతున్నారు. బస్టాండ్ లేక రోడ్డుపైనే నిలబడి బస్సుల కోసం వేచి చూడాల్సిన దుస్థితి నెలకొన్నది. అంగడికి వచ్చే ప్రజలు పార్కింగ్ స్థలం లేక తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపడంతో ఇతర వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని బస్టాండ్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అండర్-17లో ఓవరాల్ చాంపియన్ మెదక్ గురుకుల పాఠశాల క్రీడాకారులకు కప్ అందజేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి

ముగిసిన జోనల్ స్థాయి గురుకుల క్రీడలు

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 14: చదువుతో పాటు క్రీడలు సైతం అవసరమని, నైపుణ్యతను ప్రదర్శిస్తే జీవితంలో నిలదొక్కుంటారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి అన్నారు. నాలుగు రోజులుగా జిల్లా కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న రాజన్న సిరిసిల్లా 10వ జోనల్ స్థాయి క్రీడలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా హాజరైన సుహాసినిరెడ్డి బహుమతులు అందజేశారు. అండర్14లో ఓవరాల్ చాంపియన్‌గా హుజూరాబాద్, అండర్-17లో ఓవరాల్ చాంపియన్‌గా మెదక్, అండర్-19లో ఓవరాల్ చాంపియన్‌గా నర్మల గురుకుల పాఠశాలలు నిలిచాయి. కార్యక్రమంలో గురుకుల జోనల్ అధికారిణి, మెదక్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సువర్ణలత, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి

గాలికుంటు టీకాల మానిటరింగ్ రాష్ట్ర అధికారి డాక్టర్ శ్రీనివాస్ రావు

కౌడిపల్లి, నవంబర్ 14: పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా ఇప్పించాలని స్టేట్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. కౌడిపల్లి మండలం బుజరంపేట్, వెంకటపూర్ గ్రామ పరిధిలో ఎర్రమట్టి తండాలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు ముందు జాగ్రత్తగా కౌడిపల్లి పశువైద్య సిబ్బంది టీకాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మెదక్ జిల్లా ఇన్‌చార్జి పశువైద్యాధికారి వెంకటయ్య, నర్సాపూర్ ఏరియా వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ జనార్దన్‌రావుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో కౌడిపల్లి పశువైద్యాధికారి రాజు, జెవివో సుదర్శన్ పాని , ఎల్ఎస్ఏ వీరారెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ చెన్నయ్య, సిబ్బంది సుజాత, పాడి రైతులు పాల్గొన్నారు.

అధికారులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

కలెక్టరేట్‌లో ధర్నా చేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

మెదక్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా కలెక్టర్, అధికారులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఉద్యోగ జేఏసీ జిల్లా చైర్మన్ దొంత నరేందర్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్లో ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో ధర్నా చేశారు. టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, ట్రెస, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌గౌడ్, పద్మారావు, కలెక్టరేట్ ఏవోలు యూనూస్, బలరాం, డీటీసీ డీవో నాగరాజు గౌడ్, కార్యవర్గ సభ్యురాలు అనురాధ, జిల్లా సహా అధ్యక్షుడు ఇక్బాల్ పాషా, ఉపాధ్యక్షులు ఫజలుద్దీన్, లీల, సంయుక్త కార్యదర్శి పోతురాజు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట, నవంబర్ 14: వికారాబాద్ కలెక్టర్‌పై జరిగిన దాడికి నిరసనగా మున్సిపల్ సిబ్బంది, కమిషనర్ దేవేందర్, మేనేజర్ శ్రీనివాస్ నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.

ఘనంగా కార్తిక మాస పూజలు

రామాయంపేట మహంకాళి ఆలయంలో హోమాలు చేస్తున్న మహిళా భక్తులు

పెద్దశంకరంపేటలో ఉసిరి, తులసి చెట్లకు పూజలు చేస్తున్న మహిళలు

రామాయంపేట/పెద్దశంకరంపేట, వంబ14: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పెద్దశంకరంపేటలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో గురువారం ఉసిరి, తులసి చెట్లకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. లక్ష వత్తుల హోమం నిర్వహించారు. అనంతరం ఎల్లమ్మకు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుని, అక్కడే వన భోజనాలు చేశారు.

మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు

రామాయంపేటలో కార్తిక మాసోత్సవాల సందర్భంగా మహంకాళి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని మంగళహారతులు, నైవేద్యాలు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ పాండురంగాచారి దంపతులు హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వధూవరులకు మాజీ ఎమ్మెల్యే ఆశీర్వాదం

నిజాంపేట, నవంబర్ 14: నందిగామకు చెందిన మాజీ ఉపసర్పంచ్ రాజం కూతురు వివాహం చల్మెడలోని ముదిరాజ్ సంఘం ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగింది. ఈ వివాహానికి మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నేర నిర్ధారణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

సమీక్ష సమావేశంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, నవంబర్ 14: నేర రహిత సమాజ నిర్మాణంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, ప్రజలు, ప్రజాప్రతినిధులు ముందుకొచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి సూచించారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో పెండింగ్ కేసులపై నెల వారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కేసులు త్వరతగతిన పరిష్కరించాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో పూర్తి సాక్ష్యాలతో దర్యాప్తు చేసి శిక్షలు పడేలా చూడాలన్నారు. అనంతరం వివిధ కేసుల ఛేదనలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించి, రివార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పొద్దుతిరుగుడు విత్తనాల పంపిణీ

పొద్దుతిరుగుడు విత్తనాల బ్యాగులను అందజేస్తున్న వ్యవసాయ శాఖ

రామాయంపేట, నవంబర్ 14: నూనె గింజల పంటలకు అధిక డిమాండ్ ఉన్నదని, రైతులు తమ చేలల్లో పొద్దుతిరుగుడు పంటనే విత్తుకోవాలని రామాయంపేట ఏవో రాజ్‌నారాయణ తెలిపారు. గురువారం రామాయంపేట డివిజన్ వ్యవసాయశాఖ కార్యాలయంలో జాతీయ ఆహార భద్రత పథకం ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా పొద్దుతిరుగుడు విత్తనాల బ్యాగులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూనె గింజల పంటలకు జాతీయంగా, అంతర్జాతీయంగా చాలా డిమాండ్ ఉన్నదన్నారు. ఈ పంటలు తక్కువ కాలపరిమితిలో తక్కువ ఖర్చుతో చేతికొస్తాయన్నారు. 120 ఎకరాలకు సరిపోయే పొద్దుతిరుగుడు విత్తనాలు కార్యాలయంలో సిద్ధంగా ఉన్నాయన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

చిన్నశంకరంపేట, నవంబర్ 14: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మన్నన్ సూచించారు. గురువారం చిన్నశంకరంపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు.

బీఆర్ఎస్ కార్యకర్తను ఆదుకుంటాం

రామాయంపేట, నవంబర్ 14: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ కార్యకర్త రొయ్యల హరిని ఆదుకుంటామని మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంటారెడ్డి తిరుపతిరెడ్డి గురువారం తెలిపారు. ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్న హరిని కల్వకుంట పీఏసీఎస్ చైర్మన్ అందె కొండల్‌రెడ్డితో కలిసి పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు.

విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలి

కోనాపూర ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రులకు సూచనలిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

రామాయంపేట, నవంబర్ 14: విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండలంలోని కోనాపూర్, డి.ధర్మారం ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. సమావేశంలో హెచ్ఎంలు నాగేందర్, ఉపాధ్యాయులు శివరాజయ్య, భాగ్యలక్ష్మి, మహేందర్, రాజలక్ష్మి, సిద్దరాములు, ప్రవీణ్‌రెడ్డి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, స్వెటర్ల బహూకరణ

చిన్నశంకరంపేటలో..

కౌడిపల్లిలో..

చిన్నశంకరంపేట, నవంబర్ 14: బాలల దినోత్సవం సందర్భంగా చందాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సానీక్షా ఫౌండేషన్ అహిల్య, లయన్స్‌క్లబ్ వారి సౌజన్యంతో గురువారం బ్యాగులు, నోటుపుస్తకాలు, మోటివేషన్ స్టికర్లను అందించారు. ఖాజాపూర్ తండాలో అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులకు స్వెటర్లు అందించారు. కార్యక్రమంలో సానీక్ష ఫౌండేషన్ చైర్మన్ శివ, భాస్కర్, స్వాతి, వెంకటేశ్ , రాజ్‌కుమార్, శ్రీశైలం, విఠల్, రమేశ్, నవీన్ పాల్గొన్నారు.

కౌడిపల్లిలో..

కౌడిపల్లి, నవంబర్ 14: సగర రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు మర్క సురేశ్ సహకారంతో వెలమకన్నెలోని అంగన్‌వాడీ 1, 2లో 35 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి రవి సాగర్, సాయినరేశ్, ప్రభు, మల్లేశం, అంగన్‌వాడీ టీచర్లు ప్రవీణిక, అఖిల పాల్గొన్నారు.

మధుమేహంపై జాగ్రత్తగా ఉండాలి

రేగోడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు

రేగోడ్, నవంబర్ 14: మధుమేహం పట్ల జాగ్రత్తగా ఉండాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్ అన్నారు. గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మధుమేహ వ్యాధి దినోత్సవం సందర్భంగా రేగోడ్‌లో లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సమయానికి మందులు వాడాలని, రోజూ దినచర్యగా వాకింగ్, యోగా, వ్యాయామాలు చేస్తూ మితంగా ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ర్యాలీలో దిగంబర్‌రావు. మాజీ ఎంపీటీసీ మన్నె నరేందర్, చోటు మియా, సంగమేశ్వర్, శివకుమార్, భాస్కర్ పాల్గొన్నారు.